# నేలపట్టును సందర్శించిన కలెక్టర్ కుటుంబ సభ్యులు

దొరవారిసత్రం, డిసెంబర్ 29 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా నేలపట్టు పక్షుల కేంద్రంలో విడిది చేసిన విదేశీ విహంగాలను, జింకల పార్కును తిలకించారు. అనంతరం నేలపట్టులో ప్రసిద్ధిగాంచిన విదేశీ, స్వదేశీ పక్షుల సంతానోత్పత్తిపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు నేలపట్టు ఫారెస్ట్ అధికారి బాలయ్య ఉన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# గంగమ్మకు రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 29 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకం జరిగింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో పలు కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పుష్కరిణీ వద్ద ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. తిరుపతి జయనగర్ కాలనీ సర్పంచు కోటేశ్వరరావు, మునిపుష్ప దంపతులు రూ. 26,121లు అన్నదానాని విరాళంగా అందించారు. ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి, అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.



# కుప్పం ప్రజల రుణం రెట్టింపు అభివృద్ధితో తీర్చుకుంటా

## పులివెందులకు నీళ్లిచ్చా.. కుప్పానికి ఇచ్చే బాధ్యత మీకు లేదా..?
## అధికారంలో రాగానే వంద కోట్లతో కుప్పంలో ఎయిర్‌పోర్ట్ : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు

శాంతిపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త

మరలా అధికారంలో వచ్చి కుప్పాన్ని రెట్టింపు అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని ప్రతిపక్ష నేత, మాజీసిఎం నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం శాంతిపురంలో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డికి కుప్పం గ్రానైట్‌పై ఉన్న ప్రేమ ప్రజలపై లేదన్నారు. ఇసుక, మైనింగ్ వీరి కంట పడితే మటాష్ అని పేర్కొన్నారు. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఓ వ్యక్తిని బెదిరించి క్రషర్ లాక్కొని రెండువందల కోట్లు సంపాదించాడన్నారు. కుప్పం రెస్కోలో ఉద్యోగాలు లక్షలకు అమ్ముకున్నారని, చివరకు గంగమ్మ గుడి ఛైర్మన్ పదవి పోస్టు అమ్ముకుంటే ఆ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. శాంతిపురం మండలం సాతు వద్ద భూకబ్జా, నల్లగుట్టవద్ద వైకాపా నేత దండపాణి నాలుగు ఎకరాలు, అబకలదొడ్డిలో శివాలయం భూములు, చెంగుబళ్లలో చెరువు స్థలాలను వైకాపా నేతలు కబ్జాచేశారన్నారు. కుప్పం తెలుగుజాతికి ప్రయోగ శాల అన్నారు. కుప్పంలో ఏ నాడు తాను కులమతాలు చూడలేదన్నారు. కుప్పంలో ప్రతి ఇంటి పెద్ద కొడుకుగా ఉండాలని చూశానన్నారు. నామినేషన్‌కు రావద్దని, విరాళాలు సేకరించి గెలిపించిన దేశంలోని ఏకైక నియోజకవర్గం కుప్పం అన్నారు. ఇక్కడ నుంచే ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, ఇజ్రాయిల్ టెక్నాలజీ ప్రారంభించామన్నారు. 35 ఏళ్ల క్రితం కుప్పంలో ఒకే రోడ్డు ఉండేదన్నారు. స్కూళ్లు ఉండేవి కాదన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు హంద్రీ-నీవా కాలువల నిర్మాణాలు చేపట్టామన్నారు. వి.కోట వరకు హంద్రీ-నీవా నీరు తెచ్చానని మిగతా 13శాతం కాలువ పనులు పూర్తిచేయక వైకాపా ప్రభుత్వం కుప్పంపై శీతకన్ను వేసిందన్నారు. తాను అధికారంలో ఉన్నపుడు పులివెందులకు నీళ్లిచ్చానని కుప్పానికి నీళ్ల ఇచ్చే బాధ్యత వైఎస్సార్సీ ప్రభుత్వంకు లేదా?అని ప్రశ్నించారు. మరలా అధికారంలో రాగానే కుప్పంలో వంద కోట్లతో ఎయిర్‌పోర్ట్ నిర్మించి రైతుల పంటలు, కూరగాయల ఎగుమతికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. గ్రామాల్లో అవసరమైన మేర సిమెంట్ రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కుప్పానికి పరిశ్రమలు తెస్తామన్నారు. కుప్పంలో ప్రతి చెరువుకు నీరు చేర్చి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్రంలో సంపద సృష్టించి ఆదాయం తెచ్చి పేదలకు పంచుతానని చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, నాగరాజు, మణి, ఉయ్యాల జయరాంరెడ్డి, నాగభూషణంరెడ్డి, రమేష్, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, గోపాల్ పాల్గొన్నారు.



బహిరంగసభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, హాజరైన జనం

## జగనన్న విద్యాదీవెన నగదు
# తల్లుల ఖాతాల్లో జమ

### 32225 మంది తల్లుల ఖాతాల్లో రూ. 25.79 కోట్లు
### జిల్లాలో 35248 మంది విద్యార్థులకు చేకూరిన లబ్ది : కలెక్టర్



జగనన్న విద్యా దీవెన నగదు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త

పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు అనే ఉద్దేశ్యంతో సిఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని అందులో భాగంగా విద్యా దీవెన కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సిఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న విద్యా దీవెన నాల్గవ త్రైమాసికంకు చెందిన ఫీజు రియింబర్స్మెంట్ ఆర్థిక సాయాన్ని 8,09,039 మంది విద్యార్థులకు లబ్ది చేకూరుస్తూ రూ. 584 కోట్లను పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం నుండి కంప్యూటర్ బటన్ నొక్కి అర్హులైన విద్యార్థులకు చెందిన మొత్తాన్ని తల్లుల, విద్యార్థుల ఉమ్మడి ఖాతాల్లోకి నేరుగా జమ చేయగా స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని వీక్షించి ఏర్పాట్లు చేయగా జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి, సంబంధిత అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు సిఎం సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాల్గవ త్రైమాసికం జగనన్న విద్యా దీవెన ఆర్థిక సాయాన్ని జిల్లాలో 35248 మంది విద్యార్థులకు చెందిన 32225 మంది తల్లులకు చెందిన ఉమ్మడి ఖాతాలకు సుమారు రూ. 25.79 కోట్లు నేడు సిఎం భీమవరం నుండి కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేయడం జరిగిందని తెలిపారు. జగనన్న విద్యా దీవెన మొత్తం తల్లుల, విద్యార్థుల ఉమ్మడి ఖాతాల్లో జమ అయిన పది రోజుల్లోపు సంబంధిత కళాశాలలకు చెల్లించి తల్లుల సహకరించాలని, లేనిచో తదుపరి వారి జగనన్న విద్యా దీవెన మొత్తాన్ని నేరుగా కళాశాలలకు చెల్లింపు చేస్తారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా విద్యార్థుల చదువు కోసం పెట్టే డబ్బు ఖర్చు కాదని వారి భవిష్యత్తుకు పెట్టుబడి అని గమనించి అందరు తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకొని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తయారై రాష్ట్రానికి దేశానికి సేవ చేయాలని కోరారు. అనంతరం విద్యా దీవెన కింద రూ. 25.79 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ మోగా చెక్‌ను విద్యార్థులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి భాస్కర రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎనిమిది అంతస్థులతో యాత్రికులకు అచ్యుతం, శ్రీపథం

## 8వేల మంది భక్తులకు వసతి



తిరుమల, డిసెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:

దేశవిదేశాల నుండి శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు రోజురోజుకూ లక్షమందికిపైగా భక్తులు వస్తున్నారని, వీరికి తిరుపతిలో మరింత సౌకర్యవంతంగా టిటిడినే మెరుగైన వసతి సముదాయాలు అచ్యుతం, శ్రీపథం నిర్మిస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. రానున్న మూడుసంవత్సరాల కాలవ్యవధిలో నిర్మాణంకానున్న వసతిసముదాయాలు ఒక్కో బ్లాక్‌ను ఎనిమిది ఫ్లోర్‌లతో నిర్మిస్తామన్నారు. 8,200మంది భక్తులు ఇందులో బసచేసే అవకాశం ఉంటుందన్నారు. దాదాపు 200కుపైగా కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు.నాల్గవ ఫ్లోర్ నుండి ఎనిమిదవ ఫ్లోర్ వరకు ఒక్కో ఫ్లోర్‌లో 8 ఫ్యామిలీ సూట్ గదులు, 100 గదులు, మొత్తం 540 గదులు ఉంటాయని చెప్పారు. తిరుపతిలో పాత గోవిందరాజస్వామిసత్రాలు స్థానంలో నిర్మితంకానున్న అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలకు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఈఓ ఏవిధర్మారెడ్డి, తిరుపతి నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష, ఉపమేయర్ భూమన అభినయ్‌రెడ్డి, టిటిడి జెఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం,సిఈ నాగేశ్వరరావు, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఎలక్ట్రికల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ వేణుగోపాల్, పిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు.

## పండుగ వాతావరణంలో
# వైఎస్‌ఆర్ పెన్షన్ల కానుక

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

నూతన సంవత్సరంలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలను పండుగ వాతావరణంలో నిర్వహించడానికి సంబంధిత అధికారులు పక్కా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుండి శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ మున్సిపల్ కమీషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఓలతో నూతన సంవత్సరం జనవరి, ఫిబ్రవరిల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి దిశా నిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 2024 జనవరి 1 నుండి వైఎస్ఆర్ పెన్షన్ కానుక రూ.2,750 నుండి రూ.3 వేలకు పెంచి అవ్వాతాతలకు అందించనుందన్నారు. జనవరి 1 నుండి 8వ తేదీ వరకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక, జనవరి 23న వైఎస్ఆర్ ఆసరా, ఫిబ్రవరి 5న వైఎస్ఆర్ చేయూత పథకం ప్రారంభించడం జరుగుతుందని, వైఎస్ఆర్ చేయూత పథకం కింద ఫిబ్రవరి 5 నుండి 14వ తేదీ వరకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అధికారులు మనసు పెట్టి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనేలా వారితో సమన్వయం చేసుకొని వారి షెడ్యూల్ మేరకు పండుగ వాతావరణలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ఈ కార్యక్రమాలతో పాటు ద్వైవార్షిక లబ్దికి అర్హులైన వారికి నిధులు అందించనున్నామని, జనవరి 9న జగనన్న తోడు కార్యక్రమాలను సిఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుండి డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, మెప్మా పిడి రాధామ్మ, డ్వామా పాడి గంగాభవానీ, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రాజలక్ష్మి, డిఎల్‌డిఎ రవికుమార్, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

## జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి
# పసిడి పుష్పాలతో అభిషేకం
## -భక్తిశ్రద్ధలతో నిత్యోత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి నిత్యపూజలు, అభిషేకాలు ప్రత్యేక అలంకారాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారికి 116 బంగారు పుష్పాలతో అభిషేకించారు. అంతేకాక శుక్రవారం అమ్మవారికి బంగారు చీరతో ముస్తాబు చేసి వజ్రకిరీటాన్ని అలంకరించారు. ఇటీవల ఆలయానికి అతిథుల తాకిడి అధికంగా ఉంటుంది. ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సూచనలతో ఆలయ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ధనుర్మాసం కావటంతో మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. సాధారణంగానే శుక్రవారం అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. మహిళా భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితిగా ఉంది. ఈ సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది.

### నిత్యోత్సవం భక్తులకు సంబరం:

శ్రీకాళహస్తీశ్వరాలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి. కుడివైపు చూస్తే మృత్యుంజయస్వామి ప్రతిష్టిత లింగం దర్శనమిస్తుంది. ఎడమవైపు నిత్యకళ్యాణోత్సవం దర్శనమిస్తుంది. ఇక శుక్రవారం ఆలయంలో నిత్యోత్సవం ప్రత్యేక ఆకర్షణ. భక్తులకు పండగే పండగ అన్నట్లు ఉంటుంది. ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం, మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది. శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి బంగారు చీర, వజ్రకిరీటంతో పాటు సాయంత్రం బంగారు పుష్పాలతో అభిషేకం ప్రత్యేకార్షణగా మారింది.

# అట్టహాసంగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రమాణ స్వీకారం

తడ, డిసెంబర్ 29 ప్రభాతవార్త





తడ మండలం పులివేంద్రలో ఉన్న సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎఎంసి ఛైర్మన్‌గా సూళ్లూరుపేట మండలం గోపాల్‌రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పర్వతరెడ్డి కవిత, వైస్ ఛైర్మన్‌గా తడకండ్రిగకు చెందిన పి.నాగరాజారెడ్డితో పాటు మరో 17 మంది పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కమిటీకి శాసనసభ్యుడు సంజీవయ్య గౌరవాధ్యక్షునిగా వ్యవహరిస్తారు. కొండూరు పంచాయతీ పరిధిలోని పులివేంద్ర వద్ద ఈ సందర్భంగా బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభా వేదికపైనే సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విలువలు, విశ్వసనీయతతో కూడిన అమ్ముడుపోని ఎమ్మెల్యేగా కీర్తించారు. ఎమ్మెల్యే సంజీవయ్య తన ప్రసంగంలో రాష్ట్రంలోనే ఈ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆదర్శంగా నిలిచే స్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మండలాధ్యక్షులు కొళవి రఘురెడ్డి, అల్లూరు అనిల్‌రెడ్డి, కురుగొండ్ల ధనలక్ష్మి, శేఖర్‌రెడ్డి, నాయుడుపేట ఎఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎఎంసి ఛైర్మన్ మారంరెడ్డి వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన



గూడూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గూడూరులో నిరవధిక సమ్మె నాలుగవ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శిబిరంలో తలకు ఉరి తాళ్లు బిగించుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.గోపీనాథ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నాలుగున్నరేళ్లు దాటిపోతున్నా ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కరోనా కాలంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఫ్రంట్‌లైన్ వారియర్స్ అని అభినందించారని, మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్‌లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు బివి రమణయ్య, మున్సిపల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.రమేష్, దారా కోటేశ్వరరావు, శ్రామిక మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, ఎం.సంపూర్ణమ్మ, కామేశ్వరరావు, ఎం.రమణయ్య, సుబ్రహ్మణ్యం, ఎం.రమేష్, అశోక్, గోపి, రోషన్, కిరణ్, పెంచలయ్య, ఇ.వెంకటరమణయ్యలు పాల్గొన్నారు.



జగనన్న విద్యా దీవెన మెగా చెక్కును విద్యార్థులకు అందిస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

# ప్రతిపేద విద్యార్థి ఉన్నత విద్య కోసమే విద్యాదీవెన
## జడ్పీ ఛైర్మన్

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

నిరుపేదవిద్యార్థుల కుటుంబాల్లో వెలుగు నింపడానికే సిఎం జగన్మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన ద్వారా కుటుంబంలో ఎంత మంది వుంటే అంతమంది పిల్లల చదువుకు అయ్యే పూర్తి ఫీజును రీఎంబర్స్‌మెంట్ చేయడం జరుగుతున్నదని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం జులై-సెప్టెంబర్ 2023 త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన కార్యక్రమంను పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుండి కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ర్చువల్ విధానంలో జిల్లా సచివాలయం నుండి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## విశ్వసనీయతకు మరోసారి పట్టం

– నారాయణస్వామికి వైకాపా అభ్యర్థిత్వం ఖరారుపై జడ్పీటీసీ అన్బుగలన్

**పాలసముద్రం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు మరోసారి పట్టం కట్టి జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా డిప్యూటీ సిఎం నారాయణస్వామి పోటీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు జడ్పీటీసీ అన్బుగలన్ తెలిపారు. జడ్పీటీసీ అన్బుగలన్ శుక్రవారం మాట్లాడుతూ డిప్యూటీ సిఎం నారాయణస్వామిని మరోసారి వైకాపా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి ఎన్నికల్లో గెలిపించుకొంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, మాజీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, ఎంపిటీసీ గోవిందరాజులు, పోలయ్య, చందర్‌రాజు, సుమన్‌రాజు, వేణు, అంబేద్కర్, ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థికంగా మత్స్యకారులు వృద్ధి

– జిల్లా మత్స్యశాఖ అధికారి రవికుమార్

**బంగారుపాళ్యం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** మత్స్యకారులు అన్ని విధాల వృద్ధి చెందుతూ ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.రవికుమార్ అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యంలో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్య సంపద అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వపరంగా రాయితీ ఇస్తూ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర స్పెషల్ ఆఫీసర్ మునిమారన్, మత్స్య అభివృద్ధి అధికారులు పుల్లయ్య, రామ్మోహన్, పయణి, ఫీల్డ్ అసిస్టెంట్లు గౌరి, జయంతి, బంగారుపాళ్యంలోని గంగపుత్ర మత్స్య సహకార సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, ఉమాపతి, సభ్యులు చంద్రశేఖర్, పివి రెడ్డప్ప, రఘు, రాజా తదితరులు పాల్గొన్నారు. అనంతరం రుణాల మంజూరు కోసం మత్స్యకారుల నుండి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు.

## సేవకు ప్రతిఫలం మరోసారి అభ్యర్థిత్వం



**ఎస్ఆర్ పురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** జిడినెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి డిప్యూటీ సిఎం నారాయణస్వామి చేసిన సేవకు ప్రతిఫలంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆయనకు మరోసారి ఇక్కడి నుండి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వైకాపా అభ్యర్థిత్వం ఖరారు చేశారని రాష్ట్ర వైకాపా నాయకులు కుప్పయ్య అన్నారు. డిప్యూటీ సిఎం నారాయణస్వామికి మరోసారి వైకాపా అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బిఆర్ అబేద్కర్ విగ్రహ పరిసరాల్లో వైకాపా నాయకులు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకొన్నారు. ఈ క్యాక్రమంలోవైకాపా మండల పార్టీ అధ్యక్షుడు మణి, ఎంపిపి సరిత జనార్ధన్, సర్పంచ్ హరిత కుప్పయ్య, బాబు, మహేష్, సూరిరెడ్డి, ఉమాపతి, ఆనంద్, ఢిల్లీరెడ్డి, రామచంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి

గుడిపాల, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



రాష్ట్ర భూగర్భ గనులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని గుడిపాల సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి శుక్రవారం తిరుపతిలోని మంత్రి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతి ఒక్కరు పార్టీ అభ్యర్థులగెలుపుకోసంకష్టపడిపనిచేయాలనికోరారన్నారు. ఈ సందర్భంగా మంత్రి తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారని ఆయన చెప్పారు

## వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌ను పరామర్శించిన చంద్రబాబు

కుప్పంరూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త



ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తన వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌ను పరామర్శించారు. గతకొంతకాలంగా మనోహర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో కుప్పంలోని మనోహర్ స్వగృహంకు వెళ్లి చంద్రబాబు నాయుడు ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల చదువుల గురించి అడిగారు. త్వరగా కోలుకోవాలని మనోహర్‌కు సూచించారు.

## యుటిఎఫ్ డెయిరీ..కేలండర్ల ఆవిష్కరణ



**కుప్పంరూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త** కుప్పం విద్యాశాఖ కార్యాలయంలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన డెయిరీ, కేలండర్లను ఎంఇఒలు మహబూబ్ బాషా, రాజారాం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాలి సురేష్, నేతలు రఘుపతిరెడ్డి, రాజేం ద్ర ప్రసాద్, సుబ్రమణ్యం, చందు, హరిప్రసాద్, పట్టాభి, వెంకటరమణ పాల్గొన్నారు.

## ఆరోగ్యవంత రాజకీయాలకు కేరాఫ్ పెద్దిరెడ్డి కుటుంబం

-బిసివై రామచంద్రయాదవ్‌పై పెద్దిరెడ్డి ఆగ్రహం



**చౌడేపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త** ఆరోగ్యవంత రాజకీయాలకు పెద్దిరెడ్డి కుటుంబం కేరాఫ్‌గా నిలుస్తుందని వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరును విడచి వెళుతున్నారన్న తప్పుడు ప్రకటనలను దృష్టిలో వుంచుకొని బిసివై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రయాదవ్ తప్పుడు మాటలనడం సమంజసం కాదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేస్తారనీ, రాబోయే 20యేళ్ళు ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతు న్నారని స్పష్టం చేసారు. వార్డుస్థాయి లేని రామచంద్రయాదవ్ మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించడం హాస్యాస్ప దన్నారు. జడ్పీటీసీ నండింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, వైకాపా మండలాధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు, సింగిల్ విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్, బోయకొండ ధర్మకర్తలమండలి సభ్యుడు పవన్‌రాయల్, ఎంపిటీసీలు తొండా శ్రీరాములు, రూపారేఖ, చెంగారెడ్డి, గిరిరాజు, నున్నా భాస్కర్, మండలంలోని సర్పంచులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## నిబంధనలు పాటించాలి : ఎస్ఐ రమేష్ బాబు

**వెదురుకుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త** :నిబంధనలు పాటించి ఆటోలు నడపాలని ఎస్ఐ రమేష్ బాబు ఆటో డ్రైవర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు పరిమితికి మించి జనాలు ఎక్కించకూడదని నిబంధనల మేరకు ప్రయాణికులను సురక్షితంగా తరలించాలని చూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

## ప్రభుత్వ భూమిని కాపాడలని తహాశీల్దార్‌కు పాతగుంట గ్రామస్తులు వినతి

**వెదురుకుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** పాతగుంట గ్రామంలో



ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడలని గ్రామస్థులు శుక్రవారం తహాశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం సమర్పించారు. గ్రామస్థులకు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి … పాతగుంట గ్రామంలో 159–5 సర్వే నంబర్‌గల గ్రామ కంఠం భూమిని అదే గ్రామంకు చెందిన శంకర్ రెడ్డి మరియు వెంకటముని రెడ్డిలు ఆక్రమించుకున్నట్లు పేర్కొన్నారు. పలు పర్యాయములు రెవెన్యూ అధికారులకు గ్రామ కంఠం అక్రమణపై ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని వాపోయారు. కాని అక్రమణదారులు యధేచ్ఛగా అక్రమించుకున్న పట్టించుకూనేవారు లేరని వేదన వ్యక్తం చేశారు. గ్రామ కంఠం భూమి సర్వే చేసి ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు చంద్రబాబు రెడ్డి, పాతగుంట గ్రామస్థులు పాల్గొన్నారు.

## నీతి నిజాయితీకి నిలువుట్టదం నారాణస్వామి

– మండల గృహసారధుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం వెల్లడి

**వెదురుకుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** నీతి నిజాయితికి నిలువుట్టదంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి నిల్చిపోయారు. దీనికి నిదర్శనం ముచ్చట్టగా మూడవసారి అటు కాంగ్రెస్ పార్టీలోనూ, ఇటు వైసీపీలోనూ ముచ్చటగా మూడు పర్యాయాలు టిక్కెట్టు సాధించడం. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో 2014, 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వామి పై నమ్మకంతో వైఎస్ఆర్‌సీపీ టిక్కెట్లు ఇచ్చారు. పలువురు పార్టీ టిక్కెట్లు ఆశించిన్నప్పటికి మూడో పర్యాయము తండ్రి బాటలో తనయుడు పయనించి నారాయణస్వామికి పార్టీ టిక్కెట్టును కేటాయించడం నియోజకవర్గంలోని పలువురు ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డిని అభినందిస్తున్నారు. నారాయణస్వామి పై కొంతమంది టీడీపీ నాయకులు తమ ఉనికిని చాటుకోవడంకు ఆయన పై విమర్శలు చేయడం విడ్డూరమని మండల గృహసారధుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం అన్నారు.

## గంగినేని చెరువు పరిసరాల్లో పెరియార్ విగ్రహాలు

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** చిత్తూరు గంగినేని చెరువు పరిసరాల్లో స్వాతంత్ర్య సమరయోధులైన పెరియార్ సోదరుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్‌లు పేర్కొన్నారు. రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బుల్లెట్ సురేష్‌లు విలేకరులతో మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని బ్రిటీష వారిపై పోరాడిన స్వాతంత్ర్య సమర యోధులు పెరియార్, చిన్నయార్ స్వాములని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పెరియార్, చిన్నయార్ విగ్రహాలను చిత్తూరులో ఏర్పాటు చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామంచంద్రారెడ్డిని కలిసి విన్నవించామని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చొరవతో గంగినేని చెరువు పరిసరాల్లో విగ్రహాలు ఏర్పాటుకు స్థలం కేటాయించారని బుల్లెట్ సురేష్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కొత్తగా ఒక పార్కును అభివృద్ధి చేయడంతో పాటు విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞాన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## నారాయణస్వామికి వరించిన ఎమ్మెల్యే సీటు

ఎంపిపి లతాబాలాజీ

**కార్వేటినగరం, డిసెంబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామికి మరోసారి ఎమ్మెల్యే సీటు వరించిందని కార్వేటినగరం ఎంపిపి లతాబాలాజీ అన్నారు. కార్వేటినగరం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా, కుట్రలు పన్నినా జగనన్నకి నమ్మినబంటు నారాయణస్వామి కుటుంబానికే తన మద్దతు అని నిరూపితమైందని అన్నారు. మండల కన్వీనర్ శేఖర్‌రాజు మాట్లాడుతూ నారాయణస్వామి గెలుపునకు ఐక్యమత్యంగా పోరాడి విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, పిఎసిఎ ఛైర్మన్ లోకనాధరెడ్డి, జెసియస్ కన్వీనర్ పురందర్, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోపి, వైస్ సర్పంచ్ శేషాద్రి, సర్పంచ్‌లు లోక, ధనశేఖర్, ఆదాం, ఎంపిటిసి మురగయ్య, విమలానంద్, నందినిధనరాజ్, అంకయ్య, హమీద్, మునికృష్ణయ్య, జేజేలురెడ్డి, పట్టాభిరెడ్డి, మురళిరాయల్, దొరబాబు, రవిరెడ్డి, దొరస్వామిరాజు, శేఖర్, సరేష్, ధనయాదవ్, మురార్జిరెడ్డి, సతీష్, పురుషోత్తం, వరాలురెడ్డి, మురళిరెడ్డి, రఫీ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా జోగి గురుమూర్తి ఎన్నిక



**కార్వేటినగరం, డిసెంబరు 29 ప్రభాతవార్త:** పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా కార్వేటినగరం మండలం పాదిరికుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు జోగి గురుమూర్తి నియమితులయ్యారు. విజయవాడలో మంగళవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నియామకం జరిగిందన్నారు. గతంలో ఈయన మండల పిఆర్‌టియు అధ్యక్షుడుగా, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రముఖ వ్యాపారవేత్త ముల్లంగి ఆంజనేయులు మృతి



**సదుం, డిసెంబరు 29 ప్రభాతవార్త:** సదుం పట్టణం శ్రీవాసవీకన్యకాపరమేశ్వరీదేవి వీధికి చెందిన ముల్లంగి ఆంజనేయులు శెట్టి(94) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన సదుంలో పిండిమిల్లులు, వడ్లు మిషన్ పెట్టుకుని ఉన్నారు. దానితో పాటు పలు దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని పలు దేవాల యాలకు, చర్చిలకు నిదులు సమకూర్చారు. అదేవిధంగా సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి మెరిట్ విద్యార్థులకు ప్రతి యేడాది ఉపకారవేతనాలు ఆందజేస్తున్నారు. ఆయనమృతికిమండలంలోనిపలువురు నాయకులు, వ్యాపారస్తులు సంతాపం తెలిపారు

## అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



**తవణంపల్లె, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని జొన్నగురకల గ్రామంలో శుక్రవారం చోటుచేసు న్నట్లు స్థానిక ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు. జొన్నగురకల గ్రామానికి చెందిన సి.సు ధాకర్(39) అనే వ్యక్తి అప్పుల బాద తాళలేక శుక్రవారం ఉదయం 6.30 గంటలకు తన వ్యవసాయ పొలం వద్ద మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటనపై మృతుడి భార్య పి.సంగీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సుబ్రమ ణ్యం కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయలు

**పెద్దపంజాణి, సెప్టెంబర్01, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన



సంఘటన పెద్దపంజాణి మండలంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు బెరపల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి కుమారడు జి.సుధాకర్ రెడ్డి(27) బెరబల్లి నుండి పెద్దపంజాణి వైపు ద్విచక్రవాహనంలో వస్తున్న క్రమంలో చిన్నేపల్లి సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధాకర్ రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు 108 అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

– గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్– 30 మద్యం సీసాలు స్వాధీనం, ఒకరు అరెస్ట్



**గూడూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తీసుకొస్తున్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. గూడూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పట్టణంలోని చవటపాలెంలో అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాత్రి 12 గంటల సమయంలో రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. సుమారు 30 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశామన్నారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని, దీన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

– గూడూరు వన్ టౌన్ సీఐ హజరత్‌బాబు



**గూడూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త** గూడూరు ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడుతూ అనుమతి మేరకు మాత్రమే వేడుకలు జరుపుకోవాలని గూడూరు వన్ టౌన్ సీఐ జి.హజరత్‌బాబు తెలిపారు. ఈ నెల 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు మాత్రమే సంబరాలు చేసుకునేందుకు అనుమతి ఉందని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ సిస్టమ్ వినియోగించేందుకు విధిగా సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పారు. వేడుకల్లో భాగంగా అశ్లీల నృత్యాలు, సినిమాలు, అసాంఘిక కార్యకలాపాలు లేకుండా చూసుకోవాలన్నారు.

## వంద రోజుల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త



వంద రోజుల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ప్రజల కష్టాలు తీరుతాయని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం ఐదవ వార్డు కుమ్మరి మిట్టలో భవిష్యత్తు గ్యారంటీ బాబు షూరిటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వెంకటగిరి పట్టణంలో తాను చేసిన అభివృద్ధి తప్ప నాలుగున్నర సంవత్సరంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఇంటింటికి వెళ్లి ఆయన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్లు పులికొల్లు రాజేశ్వర రావు, సిసి నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం, నాయకులు నర్సింహులు, చెంగారావు, బాబు, మంకు ఆనంద్, మల్లారం బాబు, నిడిగంటి రవి, తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి ఉద్యోగుల క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ

వెంకటగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త



పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను మున్సిపల్ చైర్‌పర్సన్ నక్క భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్క వెంకటేశ్వర రావు చేతులు మీదుగా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ చేసారు. పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శ్రీరామ నాగేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బడిమల సునీత, చొప్ప సుబ్రమణ్యం, మాడవేణు, భోగ చంద్రమౌళి, గొట్టిముక్కల రామచంద్రయ్య, మలవత్తు రమణయ్య, దొంతు వెంకట సుబ్బరాయుడు, పనసమూర్తి వెంకట శివ, చింతగింజల రాకేష్, ఉక్కదాల శ్యామ్, పురుషోత్తం వెంకటేశ్వర్లు, పొట్ట బాలాజీ పాల్గొని తమ ఐక్యతను తెలియజేసారు.

## అంగన్‌వాడీలకు అండగా ఉంటాం

**కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త** అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో చేస్తున్న ఉద్యమానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని చిట్టమూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిషోర్‌నాయుడు చెప్పారు. శుక్రవారం కోటలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమం శిబిరం వద్దకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 రోజులుగా మహిళలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టినా మహిళా మంత్రులు కూడా స్పందించకపోవడం దారుణమన్నారు.

## యువత క్రీడల పట్ల మక్కువ చూపాలి

వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వెందోటి కార్తిక్ రెడ్డి



**బాలాయపల్లి, డిసెంబర్ 29, ప్రభాతవార్త** యువత క్రీడలు పట్ల మక్కువ చూపాలని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు వెందోటి కార్తిక్ రెడ్డి తెలిపారు. జిల్లా వైఎస్ ఆర్‌సిపి అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు వెంకటగిరి నియోజవకర్గంలో బాలాయపల్లి మండల కేంద్రం పరిధిలోని జయంపు సచివాలయం నందు శుక్రవారం మండల వైసిపి కన్వీనర్ వెందోటి కార్తిక్ రెడ్డి ప్రారంభించారు. మొదట ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని కబడ్డీ, బ్యాట్మెంటన్, క్రీడలను లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బిరం ప్రదీప్ కుమార్, నిడిగలు పిడి ఎం. మణెమ్మ, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు చిరమణ సుబ్బారావు, దనిగాం వెంకటేష్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



**బాలాయపల్లి, డిసెంబర్ 29, ప్రభాతవార్త** వెంగమాంబపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు బోధనా అంశాలపై, విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి, బోధన మెళకువలపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో హెచ్‌ఎంలు సుమతి, శ్రీనివాసులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, వారు ఉత్తీర్ణత సాధించేలా చూడాలని హెచ్‌ఎం సుమతి సూచించారు. ఉపాధ్యాయులు విధులు, బాధ్యతలపై క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. విధులకు ప్రతి రోజు హాజరు, సమయపాలన పాటించాలని హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు.

## ఈ-క్రాప్ నమోదుకు రైతులు సహకరించాలి

చిట్టమూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త

2023–24 రబీ సీజన్‌కు గాను రైతులు తాము సాగు చేసే పంటల వివరాలను ఈ–క్రాప్ యాప్‌లో నమోదు చేసుకోవాలని చిట్టమూరు మండల వ్యవసాయ అధికారి సుచేంద్రప్రసాద్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఇప్పటికే ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారని తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్‌లతో కూడిన సాగు సమాచారాన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్న వీఏఎలకు అందజేయాలని సూచించారు.



## నారాయణ కళాశాల అధ్యాపకుడుకి డాక్టరేట్

గూడూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బి. మాలకొండారెడ్డి శుక్రవారం కెఎల్ యూనివర్సిటీ, విజయవాడలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నుండి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) పట్టా పొందారని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. రవిప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ బి. మాలకొండారెడ్డికి అభినందనలు తెలిపారు.

## సిడిపిఓ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త



కోటలోని సిడిపిఓ కార్యాలయంలో శుక్రవారం ముందస్తుగా 2024 నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి కార్యాలయ సిబ్బందికి పంచిపెట్టారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సిడిపిఓ మునికుమారి మాట్లాడుతూ అందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉంటూ అమూల్యమైన జీవితకాలంలో భవిష్యత్తుకు మంచిబాటలు వేసుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్యాలయ సీనియర్ సహాయకులు జిఆర్ విక్రమ్ ధరించిన తెలుగు సంప్రదాయ దుస్తులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కవిత, లక్ష్మి, నారాయణమ్మ, శేషమ్మ, కృష్ణమ్మ, బుజ్జమ్మ, పద్మ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడులు

కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని కొత్తపట్నం పంచాయతీ గోవిందపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం కోడిపందేలు నిర్వహిస్తుండగా ఎస్ఐ నాగబాబు తమ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు, ఒక కోడిని, రూ.2,020 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రజలు కూడా కోడిపందేలు ఎక్కడైనా నిర్వహిస్తుంటే ఆ స్థావరాల గురించి తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ట్యాబులపై అవగాహన పెంచుకోవాలి

**కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త** కోట మండలంలోని ఉపాధ్యాయులు ట్యాబులపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారి మస్తానయ్య సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో క్లస్టర్ స్థాయి సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టులు బోధించేవారు ఒకచోట కలుసుకోవడం వల్ల ఒకరి అభిప్రాయాలను మరొకరు సబ్జెక్టుపరంగా చర్చించుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. అదేవిధంగా ఐఐడిపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

## గూడూరు రూరల్ సిఐ విఆర్‌కు బదిలీ

గూడూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త



గూడూరు రూరల్ సిఐగా పనిచేస్తున్న జి.దశరధరామారావును రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా బాపట్ల సీఐ వేణుగోపాల్‌రెడ్డిని నియమిస్తూ ఐజి ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ సిఐగా పనిచేసిన దశరధరామారావు అన్ని వర్గాల ప్రజలతో పాటు పోలీసు శాఖలో మంచిపేరు సంపాదించుకున్నారు.

## రైల్వే ప్రయాణికుల ఆందోళన

గూడూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త

కేరళ నుంచి విశాఖపట్నం వెళ్లే స్పెషల్ ట్రైన్‌లోని కొన్ని బోగిలలో ఏసి పనిచేయకపోవడంతో గూడూరు రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులు ఆందోళనకు దిగారు. కేరళ నుంచి విశాఖపట్నం వెళ్లే స్పెషల్ ట్రైన్ గత రాత్రి ఏసీ బోగీలో ఏసీ పనిచేయకపోవడంతో ట్రైన్ సిబ్బంది రేణిగుంట వద్ద ఏసీని రిపేర్ చేశారు. అయితే కొద్దిసేపు పనిచేసిన ఏసీ తిరిగి పనిచేయకపోవడంతో గూడూరు రైల్వే స్టేషన్ వద్దకు రాగానే ప్రయాణికులు రైలు చైన్ లాగి రైలును నిలిపి ఆందోళనకు దిగారు. కొందరు రైల్వే సిబ్బంది ఏసీ లేకపోతే చచ్చిపోతారా అంటూ దురుసుగా సమాధానం చెప్పారని ప్రయాణికులుతీవ్రనిరసనవ్యక్తంచేశారు. దీంతో స్పెషల్‌ట్రైన్ కొన్ని గంటల పాటు గూడూరులో నిలిచిపోయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## నాయుడుపేట వద్ద మంత్రి కాకాణికి ఘనస్వాగతం

నాయుడుపేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త



తడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సనసవంతో పాటు సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నాయుడుపేట వద్ద ఘన స్వాగతం లభించింది. శుక్రవారం నాయుడుపేట జాతీయ రహదారిపై మల్లాం కూడలి వద్ద ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక తదితరులు ఘనస్వాగతం పలికారు.

## పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణల తొలగింపు

నాయుడుపేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని పాత బస్టాండు వద్ద నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు సంచారజాతుల వారి ఆక్రమణ లను పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారం తొలగించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఈ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దుకాణాలను తొలగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో నాయుడుపేట పోలీసులతో పాటు సూళ్లూరుపేట, గూడూరు, శ్రీహరికోట, శ్రీకాళహస్తి, దొరవారిసత్రం, ఓజిలి, పెళ్లకూరు పోలీసు భారీ ఎత్తున నాయుడుపేటకు చేరుకున్నారు.

## మంత్రి రోజాకు సీటు కేటాయింపుపై సంబరాలు

నగరి, డిసెంబరు 29 ప్రభాతవార్త:



మంత్రి రోజాకు సీటు కేటాయించినట్లు మీడియాలో వచ్చిన వార్తలపై స్థానిక వైసీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకున్నారు. భారీ ఎత్తున టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకుని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజాసేవా దృక్పథంలోపని చేసే వ్యక్తికి ముచ్చటగా మూడోసారి సీటు కేటాయించడం ప్రజాసేవకు దక్కిన విజయమన్నారు. నగరి నియోజకవర్గంలో ఆమెకు హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. సీటు కేటాయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్రశిక్ష జెఎసి కమిటీ దీక్షలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



సమగ్రశిక్ష మరియు జాయింట్ యాక్షన్ కమిటీ తిరుపతిజిల్లాలో ఉన్న 34 మండలాల పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు ఈనెల 16 నుంచి చేపడుతున్న పెన్‌డౌన్ సహాయ నిరాకరణ మరియు 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో భాగంగా పదో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా పలువురు కాంటాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ సిఎం జగన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నపుడు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ మరియు ప్రభుత్వ శాఖలల్లో పనిచేయు కాంటాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రజాక్షేత్రంలో వస్తే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బటన్ నొక్కి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షకు మద్దతుగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ వెంకటరమణ మరియు ప్రధానోపాధ్యాయులు ఆనందకుమార్‌రెడ్డి, అప్పారెడ్డి వారి బృందం ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌ఏ ఉద్యోగ సంఘ నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

## మరణాన్ని మరిచారు: కష్టాలు,కన్నీళ్ళు దిగమింగుతున్నారు!!

రెహాన్



శ్రీకాళహస్తి,డిసెంబర్ 29 ప్రభాతవార్త

మానవుడు తన జీవిత పరమార్థాన్ని పట్టించుకోకుండా,మనిషికి మరణం తప్పదనే సత్యాన్ని గ్రహించక నిత్యం విలాసవంతమైన జీవితాన్ని అనుభవించాలనే తపనలో కష్టాలు,కన్నీళ్ళు దిగమింగుతున్నారని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన ప్రసంగిస్తూ 84వేల జీవరాసుల్లో కెల్ల మానవుని అల్లాహ్ భిన్నంగా తీర్చిదిద్ది సకల సదుపాయాలు అనుభవించుటకు అవకాశం కల్పించాడన్నారు.కానీ మానవుడు అన్ని అనుభవిస్తూ అల్లాహ్‌ను విస్మరిస్తున్నాడని అల్లాహ్‌చే పంపబడిన సందేశాన్ని విస్మరిస్తున్నారన్నారు.మన ప్రవక్తలు దైవమార్గాన్ని ఆచరించి స్వర్గస్తులయ్యారన్నారు.మనం స్వర్గం నుంచి వచ్చాము. స్వర్గస్తులు కావాలన్నారు. అయితే అందుకు తగిన రీతిలో దైవమార్గంలో నడవాలన్నారు.కానీ మనం దివ్యఖుర్‌ఆన్‌ను నేర్చుకోము. నేర్చుకోవాలనే ప్రయత్నం చేయరు.గురువులను సంప్రదించము. దైవమార్గంలో వెళ్ళము మరి మనం ఎలా స్వర్గస్తులౌతారని ప్రశ్నించారు.మన ప్రవర్తనలు మార్పు రావాలి. దైవ మార్గంలో నడుస్తూ సర్వ సుఖాలను అనుభవించాలని పిలుపు నిచ్చారు.

## డిసెంబర్ 31న పార్టీలు బంద్

తొట్టంబేడు, డిసెంబర్ 29 ప్రభాతవార్త

కొత్తసంవత్సరం రానున్న నేపధ్యంలో డిసెంబర్ 31వ తేదీన రోడ్లపై పార్టీలు, మద్యం సేవించడం ఉండరాదని తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువతరోడ్లపై ద్విచక్రవాహనాలపై అధిక స్పీడ్‌తో వెళ్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం వంటివి చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువకులు మద్యం సేవించి ద్విచక్రవాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని దీంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు డిసెంబర్ 31న పార్టీలు రోడ్లపై కేక్‌కటింగ్‌లు చేయరాదని ఓ ప్రకటనలో తెలిపారు.

## షికారిలకు భూములు, ట్రాక్టర్

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని చింతపాళెంలో షికారిలు నివాసముంటున్నారు.శుక్రవారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి భూముల్లో వ్యవసాయం చేసుకోవటానికి కొత్త ట్రాక్టర్‌ను ఆయన సొంత నిధులతో అందజేసారు.చింతలపాళెంలో షికారిలకు గ్రామస్థులకు మధ్య భూముల వివాదాలు సాగుతున్నాయి.ఇక్కడ భూములను కొందరు తిరుపతి వాసులు కొనుగోలు చేసారు.అయితే షికారిలను ఆదుకొనుటకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కృషి చేసారు. గ్రామస్థులను షికారిలను సమావేశం చేసి నిరుపేదలైన షికారిల భూములను ఇప్పించారు.అంతేకాక మరాఠీపురంలో భూములను సాగుచేసుకొనుటకు నీటి సదుపాయం కల్పించారు.భూములు అయితే ఇప్పించారు? మరి వ్యవసాయం ఎలా చేసుకోవాలని షికారిల నాయకుడు డబ్బా పరశునాథ్ శాసనసభ్యునికి వినతి పత్రం అందించారు.స్పందించిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కొత్త ట్రాక్టర్‌ను శుక్రవారం ఆల్‌ఇండియా వాగ్రివేల్ సంఘాధ్యక్షుడు డబ్బా పరుశనాద్‌తో పాటు వ్యవసాయ భూములున్న వారికి అందజేసారు. మొదట ఎంఎల్‌ఏ డ్రైవ్ చేసి ప్రారంభించారు.

## ఏర్పేడులో ఆడుదాం ఆంధ్ర!

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్) డిసెంబర్ 29 ప్రభాతవార్త



ఏర్పేడు మండల కేంద్రంలో శుక్రవారం సర్పంచ్‌ల సంఘాధ్యక్షుడు నల్లపాళెం శివయ్య సారథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. యువతలోని ప్రతిభను వెలికి తీయటానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విన్నూత్నంగా ప్రవేశ పెట్టారని ఆయన అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో పోటీలు నిర్వహించారు. యువతలో ఉన్న ప్రతిభతో వివిధ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సచివాలయ ఉద్యోగులు,పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, నీరజ మండల అధికారులు, ఉపాధ్యాయులు,వాలంటీర్లు పాల్గొన్నారు.

## బిసిలకు అండగా తెలుగుదేశంపార్టీ

.శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



అనాదిగా అణచివేతకు గురవుతున్న వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ప్రాధాన్యత కల్పించి వారి పురోభివృద్ధికి బాటలు వేసి గడచిన 40సంవత్సరాలుగా బిసిలకు అండగా నిలబడింది తెలుగుదేశంపార్టీ ఒక్కటే అని తెదేపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి) తెలిపారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రకటించిన విధంగా తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన వారికి అమలు చేయబోయే పథకాలు తెలుపుతూ శుక్రవారం పురపాలక సంఘ పరిధిలోని 52వ బూత్ పరిధిలోని ఇందిరానగర్, పూసలవీధి తదితర ప్రాంతాల్లోని ప్రజలను కలసి వివరించారు. వైఎస్‌జగన్‌రెడ్డి ప్రజాకంటక పాలనకు ఘోరీ కట్టడానికి రాష్ట్రంలో బిసి వర్గాలు కంకణబద్ధులై ఉన్నారని రాష్ట్ర కార్యదర్శి డాక్టర్‌జి.దశరధాచారి తెలిపారు. బిసి వర్గాల జీవితాల్లో చీకట్లను తొలిచే వెలిగే దీపం తమ చంద్రన్న అని వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి తెలిపారు. కార్యక్రమంలో తెదేపా ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదిపాకులగోపి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, పూలశేఖర్, శివ, సుబ్రమణ్యం, కిరీటి, రియాజ్, నజీర్, మొఘల్ అహ్మద్, మస్తాన్, మహిళలు సుధా, రేవతి, కమల, దేవిక తదితరులు పాల్గొన్నారు.

## రోజాకు నగరి టిక్కెట్ కేటాయింపుపై హర్షం

విజయపురం, డిసెంబరు 29 ప్రభాతవార్త :



నగరి నియోజకవర్గంలో వైసిపి తరపున ఎమ్మెల్యే సీటు మంత్రి ఆర్.కె.రోజాకు కేటాయించడంతో శుక్రవారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో బాణా సంచా పేల్చి, స్వీట్లు పంచారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేశారు. మండలంలోని మహారాజపురం, విజయపురం, పన్నూరు. ఇల్లత్తూరు, కాళికాపురం, జగన్నాదపురం గ్రామాలో ్ల కార్యకర్తలు బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు గోపినాథ్, బూత్ కమిటీ కన్వీనర్ రాజగోపాల్, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుమార్, నాయకులు భాస్కర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, జిల్లు దాసు, అంగముత్తు, పాండ్యన్, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఊంజల్‌సేవలో భక్తులను అలరించిన పద్మావతీ అమ్మవారు

**నారాయణవనం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని తిరుప్పావై ప్రవచనంతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి అన్నమాచార్య విభాగం ఆద ్వర్యంలో సంకీర్తనలను వినిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు.

## మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (క్రీడా), డిసెంబర్ 29, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధనవనరులు, అటవీ, గనుల శాఖ మంత్రి డా. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని గౌరవ పూర్వకంగా కలిసిన ఎస్వయూ ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి కలిసారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తనవంతు సహకారమందిస్తానని, విశ్వవిద్యాలయాల్లో ఎస్వీయూను అగ్రగామిగా తీర్చిదిద్దమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు.

## కేంద్రప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన



**తిరుపతి,డిసెంబర్ 29ప్రభాతవార్త:** సుపరిపాలన దినోత్సవాల సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోదీ ప్రజలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై మరింత విస్తృతంగా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో రాష్ట్రానికి కేంద్రప్రభుత్వ పథకాలు అందిస్తున్న వాటిగురించి , ప్రజలకు సంక్షేమ పథకాలు గురించి అవగాహనకు సూచికబోర్డుల తరహాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామని గోపీనాధరెడ్డి చెప్పారు. నగరంలో ప్రజలకు తెలిసేలా ముఖ్యకూడళ్లలో ఈ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాటిబండ మురళి, జనార్ధన్‌రెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కస్పాపద్మనాభం, దేవ,శేఖర్, సి.మురళి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ జీవితంలోనూ ఆయన మహానేత

-విజయ్‌కాంత్‌కు నివాళులు

తిరుపతి,డిసెంబర్ 29ప్రభాతవార్త:



సినీజీవితంలోనేగాక రాజకీయజీవితంలోనూ ఆదర్శవంతమైన జీవితం గడిపిన మహానేత కెప్టెన్ విజయ్‌కాంత్ అని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. విజయ్‌కాంత్ అనారోగ్యంతో మృతి చెందడంతో రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కళాకారులు కెవెన్ రాజా, కస్పాపద్మనాభం,అక్కిపల్లి మునికృష్ణయ్య యాదవ్, కృష్ణారెడ్డి, భాష,కన్నప్ప, కేశవరెడ్డి, మిమిక్రీ శాంబోలా హరినాథ్ నివాళులర్పించారు. తెలుగుప్రజల్లోనేగాక తమిళనాట కూడా రాజకీయంగా ప్రజలకు సేవచేశారని కొనియాడారు.

## వెంకటాచలపతికి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిస్టరీ విభాగంలో పరిశోధనలకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ఆర్ట్సు హిస్టరీ విభాగం ఆచార్య టి.నాగమ్మ పర్యవేక్షణలో "ఇండస్ట్రీస్ ఆంధ్ర (1300 ఎడి నుండి 1600 సంవత్సరం ఎడి వరకు)"అంశంపై పరిశోధన వ్యాసం సమర్పించారు. ఇందుకుగాను ఆయనకు పిహెచ్‌డి ప్రదానం చేసింది.

## రాస్ కృషి విజ్ఞాన కేంద్రంసేవలు అభినందనీయం - డా.ఎస్.కె.చౌదరి

రేణిగుంట, డిసెంబరు 29 ప్రభాతవార్త:



రాస్‌కృషి విజ్ఞాన కేంద్రం, కరకంబాడి జిల్లా రైతాంగానికి గత 30 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలు చాలా అభినందనీయమని శుక్రవారం రాస్‌కృషి విజ్ఞానకేంద్రంలో జరిగిన జిల్లా రైతులతఓ ముఖాముఖిలో ముఖ్య అతిథిగా న్యూ ఢిల్లీకి చెందిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. ఎస్.కె.చౌదరి అన్నారు. కార్యక్రమంలో డా. పి.కె.సింగ్, వ్యవసాయ కమిషనర్, భారత ప్రభుత్వం, డా. రాయ్ బర్మన్, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్, ఐసీఏఆర్ డా. షేక్, ఎన్.మీర, డైరెక్టర్, ఐసీఏఆర్ ఆటారి, డా.ఏ.ఆర్.రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త ఎస్.వెంకటరత్నం, జనరల్ సెక్రటరీ రాస్ ఛైర్మన్, రాస్ కేవీకే అతిథులుగా పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు ఐసీఏఆర్ అధికారులు కేవీకే క్షేత్రంలోని వివిధ ప్రదర్శనా క్షేత్రాలు సందర్శించిన తరువాత రాస్‌కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా. ఎస్.శ్రీనివాసులు, రైతులతో ముఖాముఖి ద్వారా కార్యక్రమ ముఖ్య ఉద్దేశం కేవీకే చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. డీడీజీ, ఐసీఏఆర్ డా. ఎస్.కె.చౌదరి మాట్లాడుతూ రాస్ కేవీకే రైతులకు అందించిన వరిలో డ్రమ్ సీడర్ ఉపయోగించి నేరుగా వరి విత్తే విధానం, నాటు యంత్రం, వివిధ పంటల్లో యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, భూసార ఆదరిత వ్యవసాయం, సమగ్ర వ్యవసాయ విధానం, కోళ్ళ పెంపకం, వానపాముల ఎరువు తయారీ, ఔషధ మొక్కల పెంపకం, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు నారు మొక్కలు మొదలైన వాటిని సాగులో అవలంబించడం ద్వారా జిల్లా రైతులు మంచి దిగుబడులుసాధించి వారి ఆదాయం పెరిగిందన్నారు. అతిథులు కేవీకే క్షేత్రంలో అర్బన్ గార్డెనింగ్ కేంద్రాన్ని ప్రారంభించి కేవీకే రూపొందించిన కరపత్రాలు, భూసార పరీక్ష పత్రం, క్యూఆర్ కోడ్, మొబైల్ అప్లికేషన్‌లను విడుదల చేశారు. రైతులకు విత్తనాలు, నారు మొక్కలు, జీవన ఎరువులు, పురుగు మందులు, లింగాకార్షక బుట్టలు పంపిణీ చేశారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం రచించిన 30 సంవత్సరాల ప్రగతి పుస్తకాన్ని తిరుపతిలో పార్లమెంటరీ కమిటీ అధ్యయన సమావేశంలో కమిటీ ఛైర్మన్ సంజయ్ జైస్వాల్, కమిటీ సభ్యులు, లోక సభ సెక్షన్ ఆఫీసర్లు ఆవిష్కరించారు. డా.ఎస్‌కె.చౌదరి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, భారతీయ వ్యవసాయపరిశోధనా మండలి(ఐసీఏఆర్), న్యూఢిల్లీ డా. పి.కె.సింగ్, వ్యవసాయ కమిషనర్ డా.రాయ్‌బర్మన్, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్, ఐసీఏఆర్ డా.షేక్ ఎన్.మీర, డైరెక్టర్ ఐసీఏఆర్ ఆటారి, డా.ఏ.ఆర్.రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త ఎస్.వెంకటరత్నం, జనరల్ సెక్రటరీ, రాస్ ఛైర్మన్, రాస్ కేవీకే డా.ఎస్.శ్రీనివాసులు, కేవీకే హెడ్, శాస్త్రవేత్తలు, సిబ్బంది, వివిధ మండలాల నుంచి రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రారంభించిన సర్పంచ్ లక్ష్మిపతి

రేణిగుంట, డిసెంబరు 29 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం విప్పమానుపట్టెడ పంచాయతీలో సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు, పిల్లలకు, ముఖ్యంగా యువతకు చదువుతో పాటు ఆటల ఆవశ్యకత ఉందని లక్ష్మిపతిరెడ్డి అన్నారు. మానసిక ఉల్లాసంతో పాటు, శారీర దారుఢ్యం పెరుగుతుందని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## తిరుపతిలో ఇద్దరు దొంగలు అరెస్టు

**తిరుపతి క్రైం, డిసెంబర్ 29, ప్రభాతవార్త** చంద్రగిరి మార్గంలో అనుమానస్పదంగా సంచారిస్తున్న



ఇద్దరిని పోలీసులు ఆదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి నగలను స్వాదీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ విమలాకుమారి చెప్పారు. ఆమేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె వివరాలను వెల్లండించారు.తిరుపతి క్రైమ్ ఎడిఎస్‌పి, రవి కుమార్ ఆధ్వర్యంలో సిసిఎస్,ఎస్ఐలు క్రైమ్ పార్టీ సిబ్బందితో దొంగల గురించి గాలిస్తుండగా తమకు అందిన సమచారం మేరకు ఫ్లైవర్ వంతన వద్ద ఇద్దరిని ఆదుపులోకి తీసుకొని విచారించగా ఆకోణంలో దర్యాప్తు చేయగా పలు విషయాలను వెలుగులోకి వచ్చాయన్నారు.ఆ ఇద్దరిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ 60,6000వేల విలువ కలిగిన 1,266 గ్రామాల బంగార నగలు రూ 30 వేలు విలువ చేసి వెండి ఆభరణాలను స్వాదీనం చేసుకున్నారు.వారు పగలంతా రెక్కి నిర్వహించి రాత్రి వేళ్లలో చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు.పసుపులేటి సాయి 17 వ ఏటా నుంచే నేరలకు అలవాటు పడినట్లు తెలిపారు.వారిపై రాష్ట్రంలో అనేక జిల్లాలో కేసులు ఉన్నాయని వివరించారు.మరో నిందితుడు వినోద్ కుమార్ సాయి కలిసి ఈనేరాలు చేసినట్లు తెలిపారు.ఈ కేసులో దొంగలను పట్టుకొవడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినిందించారు.

## ఎస్ఎస్‌ఏ టీచర్ల సమ్మెకు బిఆర్ఎస్ మద్దతు

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి క్రైం, డిసెంబర్ 29, ప్రభాతవార్త



ఎస్ఎస్‌ఏ టీచర్ల సమ్మెకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ, ఐక్య కార్యాచరణ సమితి తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లో పనిచేస్తున్నటువంటి వివిధ విభాగాల్లోని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిసెంబర్ 16 నుండి 19వ తేది వరకు పెన్డౌన్ సహాయ నిరాకరణ, 20వ తారీకు నుండి నిరవధిక సమ్మె చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర సంవత్సరం కాలం గడిచింది. అయినప్పటికి ఇప్పటి వరకు రెగ్యులరైజ్ అనే ఉసే లేదు. రాష్ట్రంలో దాదాపు 27 వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు 20 సంవత్సరాల తర్వాత రోడ్డు బాట పట్టారు. వీరందరి జీవితాలను బాగుపరిచే విధంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, రాఘవరెడ్డి, గురునాథం, రాజేంద్ర, రామారావు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## 18 రోజులుగా అంగన్‌వాడీల దీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం , ఛలో అసెంబ్లీ దిశగా మా పోరాటం

ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు

చంద్రగిరి, డిశంబర్ 29 ప్రభాతవార్త:



అంగన్‌వాడీలు తమ సమస్యలపై 18 రోజులుగా చేస్తున్న దీక్షను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు అన్నారు. చంద్రగిరిలో దీక్ష శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ శనివారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గల 13 వేల మంది అంగన్‌వాడీలకు వేతనాల పెంపుపై జగన్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు ఛలో అసెంబ్లీ దిశగా తమ పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. ఎంఎల్ఏలకు ఇష్టా రాజ్యంగా వేతనాలను పెంచుకున్న ముఖ్యమంత్రి అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు పెంచడానికి ఇంత నిర్లక్ష్యమా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు శివ, కెవై రాజ, ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్పుకు శ్రీకారం పులివర్తి నాని గెలుపుకు అవకాశం

చంద్రగిరిలో పులివర్తి సుధారెడ్డి విస్తృత ప్రచారం

చంద్రగిరి, డిశంబర్ 29 ప్రభాతవార్త:



దశాబ్ద కాలం తరువాత వస్తున్న అవకాశంతో ప్రజలు మార్పుకు శ్రీకారం చుట్టాలని టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కోరారు. స్థానిక కొత్తపేట, జమండ్లవీధిలో శుక్రవారం ఆమె మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నాని గెలుపుకు అవకాశం లభిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ వైరుధ్యాలతో అభివృద్ధికి నోచుకోని చంద్రగిరి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గల తెలుగుదేశం ప్రభంజనంలో వైసిపి ఓటమి దాదాపుగా ఖరారయ్యిందన్నారు. 2024 ఎన్నికలలో టిడిపి విజయమే లక్ష్యంగా ముందడుగు వేయాలన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్నదానం

చంద్రగిరి, డిశంబర్ 29 ప్రభాతవార్త:



సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి భక్తులకు చంద్రగిరికి చెందిన సున్నపమునిరత్నం రెడ్డి, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. చంద్రగిరి గ్రామ దేవతగా భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి భక్తులకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు దాతలు తెలిపారు. చంద్రగిరి గ్రామదేవతగా కొలిచే అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం భక్తులకు దాతల ద్వారా అన్నదానం జరిపించే విధానాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఆకలి తీర్చడం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ సి.ఆర్.తిమ్మారెడ్డి దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం, డిశంబర్ 29 ప్రభాతవార్త:



సి.రామాపురంలోని శ్రీ బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమం ఎదురుగా గల వ్యవసాయ బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం స్థానికులు బావిలోని మృతదేహాన్ని గుర్తించి ఎస్ఐ గిరిబాబుకు సమాచారం అందించారు. దీంతో ఆర్సీ పురం ఎస్ఐ గిరిబాబు తన సిబ్బందితో కలసి సంఘటనా స్థలికి చేరుకుని బావిలోని మృతదేహాన్ని వెలికితీయించారు. గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పంగా మృతి చెందినట్లు భావిస్తున్నామని అన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మీ కుటుంబ సభ్యులలో గానీ, మీ ఇరుగు పొరుగు వ్యక్తులలో గానీ ఎవరైన కనబడకుండా పోయినట్లయితే ఆర్‌సి పురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## రైతులతో మమేకమై విజయం కోసం ముందడుగులు

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఘన స్వాగతం

చంద్రగిరి, డిశంబర్ 29 ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాలలో రైతులతో మమేకమవుతూ తన అన్నయ్య తుడా చైర్మన్, చంద్రగిరి ఎంఎల్‌ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విజయం కోసం వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ముందడుగులు వేస్తున్నారు. మండల పరిధిలోని కొటాల పంచాయతీ, పుల్లయ్యగారి పల్లి, హరిజనవాడ, పుల్లయ్యగారి ఎస్టీ కాలనీ, బందార్లపల్లిలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలను పలకరిస్తూ వరి పండించడం కోసం పొలం దున్నుతున్న రైతన్న వద్దకు వెళ్ళి ట్రాక్టర్ నడిపి అదునుదున్నిన హర్షిత్ ఔరా అనిపించుకున్నారు. రైతులపై తమకు గల గౌరవాన్ని వెళ్ళడించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్త ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేసిన సుమన్‌కుమార్

నారాయణవనం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ అందజేశారు. శక్రవారం మండలంలోని పాలమంగళం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 5 లక్షల నుంచి 25 లక్షల రూపాయాల వరకు పెంచిన ఆరోగ్య శ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. సిఎం జగనన్న పేదలను దృష్టిలో వుంచుకొని 5నుంచి25 లక్షల రూపాయాల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందడానికి అవకాశం కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. దీని వల్ల ఎంతో పేదలు కార్పోరేట్ వైద్యసేవలను అందుకోగలరన్నారు. పేదలు జగనన్నకు రుణపడి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణమూర్తి, సర్పంచులు కుప్పస్వామిరెడ్డి గాందీమతి, కె సాయిరవికుమార్, డాక్టర్ దర్శిత్‌రాజ్, ఎంఇఓ ప్రభాకర్‌రాజు, డాక్టర్ రాఘసుధ, సిహెచ్ఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమంగళంలో ఆడుద్దాం ఆంధ్ర క్రికెట్ పోటీలు ప్రారంభం

**నారాయణవనం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆడుద్దాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్రికెట్‌ను జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కశింమిట్ట, బొబ్బరాజుపాలెం, ఇప్పతాంగేల్, డికెపాలెం గ్రామాల యువకుల మధ్య జరిగిన పోటీల్లో కశింమిట్ట టీమ్ గెలిచింది. ఆటలను ఆడడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు జ్ఞానం పెరుగుతందన్నారు. ఆరోగ్యంగా వుండాలంటే క్రీడల్లో పాల్గొనాలని కోరారు. ఎంపిడిఓ కృష్ణమూర్తి, సర్పంచులు కుప్పస్వామిరెడ్డి గాందీమతి, కె సాయిరవి కుమార్, డాక్టర్ దర్శిత్‌రాజ్, ఎంఇఓ ప్రభాకర్‌రాజు, డాక్టర్ రాఘసుధ, సిహెచ్ఓ శ్రీనివాసులు, సూపరిం టెండెంట్ గుణశేఖర్, పిడిలు జయప్రకాష్, వెంకటేశ్, సదాశివం, రాజా, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీతో నిరసన

**నారాయణవనం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ



కార్యకర్తలు గత 18రోజులుగా న్యాయమైన కోర్కెల సాధనకై తహశీల్దారు కార్యాలయం వద్ద చేపడుతున్న రిలే నిరాహారదీక్ష చేపడుతున్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం నుంచి ర్యాలీ చేస్తున్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన కోర్కెల కోసం చేపడుతున్న తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. దీని వల్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు గర్భవతులు, పిల్లలు నష్టపోతున్నట్టు గుర్తు చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేయాలన్నారు.


BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II,
AT: HYDERABAD
I.A. Nos. 5672, 5673 of 2019
IN
O.S. No. 555 OF 2019

Between:
**Corporation Bank,** Punganur Branch, (Now Union Bank of India) Chittoor District, A.P. ...Petitioner/Applicant
AND
Smt. R. Saraswathamma and others ...Respondents/Defendants

To,
1) **Mr. R. Rayal Kumar,** S/o R. Krishnaiah Shetty, Aged Major, R/o Gokul Street, Punganur, Chittoor District A.P.-517247.
2) **Ms. Sarada,** D/o R. Krishnaiah Shetty, Aged Major, R/o 3rd Main Road, Masjid Road, Near KMD Kalyana Mandapam, Chintamaniyur- 563124.
...Proposed Respondents/ Defendants No.6 & 8

Take notice that Corporation Bank (Now Union Bank of India) instituted the above O.A. against you for Recovery of **Rs.62,37,757.56/-.** The Corporation Bank / Petitioner herein filed the above I.A.Nos.5672, 5673 of 2019 to set aside abatement order to bring the proposed Respondents No.4 to 8 as legal heirs of Defendant No.1 Smt. R. Saraswath amma, by adding him as Defendants No.4 to 8 in the above O.A. The Hon'ble Tribunal was pleased to order notice to you and directed the matter to be listed for hearing on **22-12-2023.** You are hereby summoned by the Hon'ble Tribunal to appear before Debts Recovery Tribunal-II, situated at Triveni Complex, 1st Floor, Abids, Hyderabad-500001 in person or by pleader duly instructed and able to answer all material questions on **28-02-2024 at 10.30 AM.** Take notice that in default of your appearance the O.A. will be heard and decided in your absence.

*By Orders of the Hon'ble Tribunal*

**M/s. DYUMANI & Co.,**
**Advocate & Solicitors**
3-5-873/A-407, Mathrusri Apts., Hyderguda, Hyderabad-500029.
**Counsel for the Petitioner/Applicant**

